పచ్చందాలు.. నేల తల్లి ఆభరణాలు



నేలతల్లిపై పచ్చని తివాచీ పరిచినట్లు పంటలు, చెట్లు, జలవనరులతో కనువిందు చేస్తున్న ఈ దృశ్యం నిర్మల్‌లోని కురన్నపేట్ వద్ద గల జాఫూర్ చెరువు, రామాసాగర్ చెరువుల సమీపంలోనిది. ఒక వైపు పచ్చని పంటపొలాలు, మరో వైపు చెరువు, అవతలి వైపు నిర్మల్ పట్టణం సుందరంగా కనిపిస్తోంది. బత్తీసగఢ్‌పై నుంచి కెమెరాకు చిక్కిన దృశ్యమిది.

- చిత్రం: న్యూస్‌టుడే, నిర్మల్

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్, న్యూస్‌టుడే: అన్ని న్యాయస్థానాల్లో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. వివాదాలు, రాజీపడే క్రిమినల్ కేసులు, పెండింగ్‌లో ఉన్న ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు చలాన్ కేసులు, ఇతరత్రా వాటికి సంబంధించిన కేసులను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని చెప్పారు.

నుడా వైపు అడుగులు!



పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోకి నిర్మల్ పట్టణ చుట్టూ పల్లెలు

నిర్మల్, న్యూస్‌టుడే

ప్రస్తుతం నగర ప్రాంతాల్లో ఉన్నట్లు పట్టణాభివృద్ధి సంస్థ తరహాలో జిల్లా కేంద్రంగా ఉన్న నిర్మల్‌లోనూ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. నిర్మల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పట్టణం చుట్టూ ఉన్న గ్రామాల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతులు కల్పనకు ఈ సంస్థను నెలకొల్పడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీ, మున్సిపల్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయడంలో నిమగ్నమయ్యారు.

సౌకర్యాల మెరుగు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే అరకొర నిధులతో గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. ఆశించిన ప్రగతి కనిపించడం లేదు. కేవలం 15వ ఆర్థిక సంఘ నిధులు మాత్రమే విడుదల అవుతున్నాయి. ఈ నిధులతో రహదారులు, మురుగుకాలువల నిర్మాణాలు, వీధి దీపాల ఏర్పాటు, ఇతరత్రా అభివృద్ధి పనులు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. సంస్థ ఏర్పాటైతే ప్రత్యేక నిధులు మంజూరు కానుండటంతో ఆ పల్లెల్లో ప్రగతి రేఖలు కనిపిస్తాయి. నిర్మల్ పట్టణం నుంచి పది కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామాలను ఈ సంస్థ ఆధీనంలోకి తీసుకొచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అధికారులు సమర్పించిన నివేదికను ప్రభుత్వం ఆమోదిస్తేనే సంస్థ ఏర్పాటవుతుంది.

ప్రయోజనం ఇలా..

జిల్లా కేంద్రంతోపాటు చుట్టూ ఉన్న ప్రాంతాలను కలిపి పట్టణ ప్రాంత అభివృద్ధి సంస్థ ఏర్పాటుకు చర్యలు మొదలయ్యాయి. పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటైతే ఇందుకోసం ప్రత్యేకంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తారు. నామినేటెడ్ పద్ధతిని ఛైర్మన్‌ను నియమిస్తారు. పురపాలక కమిషనర్ వైస్ ఛైర్మన్‌గా కొనసాగుతారు. ముఖ్య ప్రణాళిక అధికారిని నియమిస్తారు. పట్టణ ప్రణాళిక విభాగం, డీటీపీసీ సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయిస్తారు. ఈ సంస్థకు నేరుగా ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు మంజూరవుతాయి. సంస్థ పరిధిలోకి వచ్చే గ్రామాలతోపాటు నిర్మల్ పట్టణంలోనూ అభివృద్ధి పనులకు నిధులను వెచ్చిస్తారు. రహదారులు, మురుగు కాలువలు, సెంట్రల్ లైటింగ్, విభాగినుల ఏర్పాటు, ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు మౌలిక వసతులు కల్పిస్తారు. ప్రస్తుతం గ్రామాల్లో రెండంతస్తుల వరకు అనుమతి లభిస్తుండగా.. సంస్థ పరిధిలోకి వచ్చే గ్రామాల్లో అయిదు అంతస్తుల వరకు నిర్మాణాలు చేసుకునేందుకు ఈ సంస్థ అనుమతులు ఇస్తుంది. లేఅవుట్ల అనుమతులు సైతం ఈ సంస్థ ద్వారా తీసుకోవాల్సి ఉంటుంది. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఈ సంస్థ కార్యకలాపాలు కొనసాగుతాయి. సంస్థ పరిధిలోకి వచ్చే గ్రామాల్లో పంచాయతీలు, గ్రామ కార్యదర్శుల పాలన యథావిధిగా కొనసాగుతుంది. ఇతర అభివృద్ధి ప్రణాళికలు, నిర్మాణ అనుమతులకు మాత్రం సంస్థ ఇవ్వాల్సి ఉంటుంది.



నిర్మల్ చుట్టుపక్కల గ్రామాల వివరాలను డీపీవో శ్రీనివాస్ నుంచి సేకరిస్తున్న ఇన్‌ఛార్జి డీటీసీపీవో హరీశ్‌కుమార్

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం :
సి.వి.ఎన్.రాజు, మున్సిపల్ కమిషనర్, నిర్మల్

నిర్మల్ పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటు కోసం ప్రభుత్వం సూచించిన విధంగా జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి, ఈ రెండు శాఖల అధికారులతో కలిసి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. సమగ్ర వివరాలు సేకరించిన తర్వాత జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తాం.


యువతకు ఉపాధి.. పల్లెకు విస్తృతి

● మారుమూల ప్రాంతాలకు చేరిన ఈ-కామర్స్



* మంచిర్యాల జిల్లా తాండూరు మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన మనుకొండ విశ్వేశ్వర్ తనకు అవసరమైన గృహోపకరణాన్ని ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశారు. దాన్ని అతడి ఇంటి వద్దకు వెళ్లి ఈకామర్స్ సంస్థలో పనిచేస్తున్న యువకుడు జగదీశ్ అందజేశారు. మారుమూల గ్రామాల యువత, మహిళలు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తూ తమకు నచ్చిన వస్తువులను తెప్పించుకుంటున్నారు.

చెన్నూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి ఆదిలాబాద్ అనగానే అడవుల జిల్లా అని పేరు. కానీ ఇక్కడి మారుమూల పల్లెలకు సైతం ఆన్‌లైన్ వ్యాపారం విస్తరించింది. ఇంటి నుంచే ఆర్డర్ నమోదు చేయగానే తమకు నచ్చిన వస్తువు చేరుతుంది. దీని ద్వారా యువతకు ఉపాధి లభిస్తోంది. పల్లెలకు పాకిన ఈ-కామర్స్ సంస్థల విస్తృతిపై కథనం.





* చెన్నూరు పట్టణానికి చెందిన అభిరామ్ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల అనంతరం, సెలవు దినాల్లో ఆయన ఓ సంస్థలో కొరియర్‌గా పనిచేస్తున్నాడు. స్థానికులు ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్లు చేసినవి స్టాక్ పాయింట్ వద్దకు చేరుకోగా అక్కడి నుంచి వారి ఇళ్లకు వస్తువులను చేరవేస్తూ నెలకు రూ.12000 వరకు ఆదాయం పొందుతున్నాడు.


పెన్ను, పుస్తకం మొదలు.. ల్యాప్‌టాప్‌ల వరకు ఇంట్లో అవసరమైన అన్ని వస్తువులు.. వ్యాపారాల నిర్వహణకు ఉపకరించే సామగ్రి.. గృహోపకరణ, వస్త్ర, యంత్ర, సాంకేతిక సామగ్రి కొనుగోలుకు వివిధ ఈ-కామర్స్ సంస్థలు వేదికలుగా నిలుస్తున్నాయి. ఆ సంస్థలకు అనుబంధంగా జిల్లా కేంద్రం, ప్రధాన పట్టణాల్లో కార్యాలయాలు, ఏజెన్సీలు, కొరియర్ సంస్థలు వెలిశాయి. వీటి ద్వారా గ్రామీణ ప్రాంతాలకు విస్తృతంగా సేవలు అందిస్తున్నాయి. దీంతో స్థానిక యువతకు ఉపాధి లభిస్తోంది. నిర్వాహకులు ద్విచక్ర వాహనాలు ఉన్న వారిని నియమించుకుంటున్నారు. నేరుగా వినియోగదారులకు అందిస్తున్నారు.


యువత, విద్యావంతులు, మహిళలు, వ్యాపారస్థులు, ఉద్యోగస్థులు ప్రస్తుతం ఈ-కొనుగోళ్ల విధానం వైపు మొగ్గుచూపుతున్నారు. అధిక శాతం ఇంట్లో ఉదయం నుంచి రాత్రి వరకు ఉపయోగపడే ప్రతి వస్తువు కొనుగోలు చేస్తున్నారు. నిత్యావసర సరకులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇంట్లో గృహోపకరణాలకు అవసరమైనవన్నీ ఆర్డర్ చేసేస్తున్నారు.

వెలసిన ఏజెన్సీలు

జిల్లా కేంద్రాల్లో ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలకు అనుబంధంగా కార్యాలయాలు, ఏజెన్సీలు, కొరియర్ సంస్థలు కొనసాగుతున్నాయి. 20 సంస్థలకు అనుబంధంగా శాఖల వారీగా సేవలు అందుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 30 రకాల ఆన్‌లైన్ సంస్థలు ఉన్నాయి. ప్రధాన పట్టణాలైన ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల తదితర పట్టణాల్లో ఈ సంస్థలు అందుబాటులో ఉన్నాయి. స్టాక్ పాయింట్ నుంచి వీటిని ఆర్డర్ చేసిన వారి ఇళ్లకు చేరవేస్తూ పలువురు నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారు.

ఆన్‌లైన్ కొనుగోళ్లపై జిల్లాలో 100 మంది యువతతో 'న్యూస్‌టుడే' నిర్వహించిన సర్వే వివరాలు ఇలా..







ఆస్పత్రి నిర్వాహకులతో వాగ్వాదానికి దిగిన రోగి బంధువులు



వివరాలు సేకరిస్తున్న జిల్లా వైద్యాధికారి రాజేందర్

ఆస్పత్రి గుట్టురట్టు

ఖానాపూర్, న్యూస్‌టుడే: పట్టణంలోని వివేకానంద చౌక్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రోగులకు మందులు ఇచ్చే బిల్లు విషయంలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన మల్లవ్వ జ్వరంతో శుక్రవారం ఆస్పత్రికి వెళ్లారు. ఈ క్రమంలో బిల్లు చెల్లించే సమయంలో ఆస్పత్రి నిర్వాహకులు తెల్ల కాగితంపై బిల్లు రాసి ఇచ్చారు. తమకు ఒరిజినల్ బిల్లు ఇవ్వాలని ఆస్పత్రి యాజమాన్యంతో రోగి కుటుంబ సభ్యులు, కాలనీవాసులు వాగ్వాదానికి దిగారు. సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

నోటీసు జారీ చేసిన డీఎంహెచ్‌వో

ఆస్పత్రి వద్ద రోగి బంధువుల ఆందోళనతో పాటు స్థానికుల ఫిర్యాదు మేరకు జిల్లా వైద్యాధికారి రాజేందర్ వెంటనే స్పందించారు. శుక్రవారం ఆ ఆస్పత్రిలో తనిఖీలు చేశారు. అక్కడి వైద్యుల ధ్రువపత్రాలను పరిశీలించారు. వైద్యులకు సరైన పట్టాలు లేకపోవడంతో పాటు ఆస్పత్రికి అనుమతులు లేవని గుర్తించి నోటీసులు జారీచేశారు. ఆస్పత్రికి అనుమతులు వచ్చే వరకు మూసి ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు పట్టణంలోని ఇతర ఆస్పత్రులకు సైతం అనుమతులు లేవని, వాటిని కూడా తనిఖీ చేయాలని డీఎంహెచ్‌వోను కోరారు.

తెలంగాణ ఏర్పాటులో బాపూజీ కీలక పాత్ర

నిర్మల్, న్యూస్‌టుడే: తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో ఎన్నో పోరాటాలు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగించాలని రాష్ట్ర ఆర్థిక సంఘం ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. ఆయన జయంతి సందర్భంగా శుక్రవారం నిర్మల్‌లోని కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో, నిజాంకు వ్యతిరేకంగా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని చెప్పారు. గతంలో కొండా లక్ష్మణ్‌బాపూజీకి జరిగిన అవమానాలపై తాము ధైర్యంగా నిలదీశామని గుర్తు చేశారు. ఆయన త్యాగాలు ప్రపంచానికి గుర్తుండిపోయే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, భాజపా జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, భాజపా నాయకులు అయ్యన్నగారి భూమయ్య, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు చొప్పదండి భవాని, పద్మశాలి సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్ద రమణ, జిల్లా అధ్యక్షుడు చిలుక రమణ, ప్రధాన కార్యదర్శి అల్లం అశోక్, కౌన్సిలర్ బిట్లింగు నవీన్, నాయకులు ఆడెపు సుధాకర్, గుమిడ్యాల దత్తాద్రి, పెండెం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కొండాలక్ష్మణ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, 'పుర' ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్, భాజపా, కాంగ్రెస్ నాయకులు



లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్

ఆదర్శనీయుడు

నిర్మల్: కొండా లక్ష్మణ్‌బాపూజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన జయంతిని జరిపారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్‌తో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాపూజీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారు గర్వించదగ్గ విషయమని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఉద్యమకారుడిగా, రాజకీయ, సామాజికవేత్తగా ఆయన సేవలు అందించారన్నారు. బీసీ సంక్షేమాధికారి శ్రీనివాస్, డీపీఓ శ్రీనివాస్, లీడ్ బ్యాంకు మేనేజరు రాంగోపాల్, పరిశ్రమలశాఖ మేనేజరు నరసింహారెడ్డి, వివిధ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భైంసా నూతన సీఐగా గోపీనాథ్

భైంసా, నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: భైంసా పట్టణ ఎస్‌హెచ్‌వో, సీఐ డి. రాజారెడ్డి శుక్రవారం బదిలీ అయ్యారు. ఆయనను ఉన్నతాధికారులు మల్టీజోన్-1 ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఆయన స్థానంలో సైబరాబాద్ టాస్క్‌ఫోర్స్‌లో విధులు నిర్వహించిన గోపీనాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కేంద్రంలో ఎస్పీ జానకి షర్మిలను మర్యాద పూర్వకంగా కలిసి పట్టణ పరిస్థితులపై చర్చించారు. గతంలో ఆయన కూకట్‌పల్లి, శంకరపల్లిలో విధులు నిర్వహించారు. మెరుగైన సేవలందించాలని, శాంతిభద్రతల పరిరక్షణ- నేర నియంత్రణలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు.



ఎస్పీ జానకి షర్మిలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ గోపీనాథ్

దరఖాస్తు గడువు పొడిగింపు


నిర్మల్ పట్టణం: డా. బి. ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ ప్రవేశ దరఖాస్తు గడువు పొడిగించినట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. ఎం. సుధాకర్ తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులు 2024- 25 విద్యాసంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు సెప్టెంబరు 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సన్నాలే మిన్నంటూ..

● పెరిగిన వరి సాగుతో అన్నదాతకు గిట్టుబాటు
● ఉమ్మడి జిల్లాలో రూ.191.50 కోట్ల మేర ప్రయోజనం

నిర్మల్, న్యూస్‌టుడే:

ప్రస్తుత వానాకాలం నుంచే సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో సన్నాలు సాగు చేస్తున్న రైతులకు గిట్టుబాటు ధర దక్కనుంది. సాగు ప్రారంభంలో సన్నాలకు బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పడంతో గతంతో పోలిస్తే ఈ సారి సాగు పెరిగింది. ఒక వేళ సన్నాలను వ్యాపారులు అంతకంటే ఎక్కువ ధరకే కొనుగోలు చేసే అవకాశం ఉండటంతో రెండు రకాలుగా రైతులకు మేలు జరగనుంది. దీంతోపాటు అర్హులైన తెల్లరేషన్ కార్డులున్న లబ్ధిదారులకు సన్న బియ్యం ఇస్తామని చెబుతుండటంతో అటు రైతులకు ఇటు సామాన్య ప్రజలకు ప్రయోజనం జరగనుంది.



లక్ష్మణచాంద మండలం నర్సాపూర్ సమీపంలో సాగులో ఉన్న సన్నరకం వరి

రైతులు పండించిన పంటకు మద్దతు అందించేందుకు ప్రభుత్వం వివిధ ఏజెన్సీల ద్వారా గతంలో దొడ్డు రకం ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో వ్యాపారులకే ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. దీంతో ప్రభుత్వం ప్రకటిస్తున్న కనీస మద్దతు ధరతో సంబంధం లేకుండా వ్యాపారులు సన్నాలను కొనుగోలు చేస్తుండటంతో మద్దతు అంతంతమాత్రంగా ఉంటోంది. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో ఈ సారి సన్నాల సాగు అంచనాలను మించి పెరిగింది. ప్రభుత్వ సూచనల మేరకు 2021లో దొడ్డు రకాలను తగ్గించి సన్నాలతోపాటు మొక్కజొన్న, పప్పు దినుసులను అధికంగా సాగు చేశారు. సాగు విస్తీర్ణం పెరగడంతోపాటు దిగుబడి బాగా వచ్చింది. అయితే సన్నాలను కొనేవారు లేకపోవడం, ప్రభుత్వం దొడ్డు రకాలను మాత్రమే కొనుగోలు చేయడంతో సన్నరకం రైతులు ధాన్యం అమ్ముకునేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈ సారి సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో గిట్టుబాటు దక్కనుంది. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర 'ఏ' రకానికి రూ.2,320 'బి' రకానికి రూ.2,300 ధర ఉంది. దీంతోపాటు రూ.500 బోనస్ కలిపితే 'ఏ' రకానికి రూ.2,820, 'బి' రకానికి రూ.2,800 దక్కనుంది.

ఉమ్మడి జిల్లాలో 3.48 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. ఇందులో సన్నరకాలు 1,91,500 ఎకరాల్లో పండిస్తుండగా.. మిగతా 1,56,500 ఎకరాల్లో దొడ్డురకం సాగు చేస్తున్నారు. సన్నరకం ధాన్యం ఎకరానికి 20 క్వింటాళ్ల చొప్పున ఉమ్మడి జిల్లాలో 38.30 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం సన్నరకాల ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో ఉమ్మడి జిల్లాలో సన్నరకాలు పండించిన అన్నదాతలకు అదనంగా రూ.191.50 కోట్ల మేర మేలు జరగనుంది. ఉమ్మడి జిల్లాలో సన్న, దొడ్డురకాల ధాన్యం కొనుగోలుకు 608 కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. ఒక కేంద్రంలో సన్న, దొడ్డురకం ధాన్యం కొనుగోలు చేసేందుకు వేర్వేరు కాంటాలు సిద్ధం చేస్తున్నారు.

రేషన్ లబ్ధిదారులకు ప్రయోజనం

ప్రస్తుతం ఉన్న తెల్లరేషన్ కార్డుదారులతో పాటు కొత్తగా పొందే రేషన్‌కార్డు లబ్ధిదారులకు వచ్చే ఏడాది జనవరి నుంచి సన్న బియ్యం ఇస్తామని రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించడంతో ఆశలు చిగురిస్తున్నాయి. దీనివల్ల కార్డుదారులకు ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటి వరకు దొడ్డు బియ్యమే ఇస్తుండగా వీటిని చాలా మంది తినకుండా అమ్ముకుంటున్నారు. బయట సన్నాలను కిలో రూ.50 వరకు కొనుగోలు చేయడంతో ఆర్థికంగా ఇబ్బందిగా మారింది. ఇది అమలైతే పేదలకు తక్కువ ధరకు సన్నబియ్యం అందనున్నాయి.

ఉమ్మడి జిల్లాలో వానాకాలం సాగు వివరాలు (ఎకరాల్లో)

● జిల్లా ● సన్నరకం ● దొడ్డురకం ● మొత్తం

జిల్లా	సన్నరకం	దొడ్డురకం	మొత్తం
నిర్మల్	70,000	60,000	1,30,000
మంచిర్యాల	90,000	70,000	1,60,000
ఆదిలాబాద్	1,500	500	2,000
కుమురంభీం	30,000	26,000	56,000

ఉత్తమంగా చదవండి.. ఉన్నతంగా ఎదగండి

లక్ష్మణచాంద, న్యూస్‌టుడే: విద్యార్థినులు ఇప్పటి నుంచి ఉత్తమంగా చదివి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కలెక్టరేట్ అభిలాష అభినవ్ అన్నారు. లక్ష్మణచాంద కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం రాత్రి 9.30 గంటలకు ఆమె పరిశీలించారు. తరగతి గదుల్లో తిరుగుతూ విద్యార్థినులతో మాట్లాడారు. 9వ తరగతి విద్యార్థులకు డిజిటల్ బోర్డుపై లెక్కలు వేసి సమాధానం చెప్పాలని కోరారు. విద్యార్థులు స్పందించిన తీరుపై అభినందించారు. కథల పుస్తకాలు చదివించారు. డీఈవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధ, సెక్టోరియల్ అధికారులు సలోమి కరుణ, పద్మ, పాఠశాల ఎస్‌వో నవీత, ఏపీవో ప్రమీల, ఎంపీవో అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

తలసీమియా బాధితులకు వరం

- దేశీయంగా 'ఇన్‌ఫ్యూజ్ థల పంపు' అందుబాటులోకి..
- ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో ఉచితంగా అందిస్తే ప్రయోజనం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వైద్య విభాగం : కొత్తగా అందుబాటులోకి వచ్చిన 'థల పంపు' సికిల్‌సెల్, తలసీమియా బాధితుల కెంతో ఉపయోగకరంగా మారనుంది. రక్తహీనతకు గురై తరచూ రక్తం ఎక్కించుకునే బాధితుల శరీరంలో అవసరానికి మించి పేరుకుపోయే ఐరన్‌ను తగ్గించటానికి ఇచ్చే సూది మందును వేయించుకోవటానికి ఇది ఎంతగానో ఉపయుక్తంగా ఉంది. ఈ సూది మందును బాధితులకు సెలైన్‌లో కలిపి ఇస్తుంటారు. ఇలా ఇచ్చేటప్పుడు వారు పడకపై కనీసం 8 గంటల వరకు పడుకోవాల్సి వస్తుంది. కానీ థలపంపు ద్వారా ఆ ఇంజెక్షన్ తీసుకుంటే గంటల తరబడి పడకపై ఉండాల్సిన అవసరం లేకుండా ఉంటుంది. పంపు బెల్ట్‌ను శరీరంపై అమర్చుకొని సాధారణ పనులు చేసుకోవచ్చు. నిర్ణీత సమయం పాటు ఆ సూది మందు చర్మంలోకి చేరిపోతుంటుంది.


బాధితులకు థల పంపును పంపిణీ చేస్తున్న ఎంపీ నగేష్


ఇలా ఇన్‌ఫ్యూజ్ పంపును ఏర్పాటు చేసుకొని సూది మందు తీసుకోవచ్చు

ఉమ్మడి జిల్లాలో బాధితులు ఇలా..
తలసీమియా : 2021
సికిల్‌సెల్: 565

ఇన్‌ఫ్యూజ్ థల పంపు ప్రస్తుతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీని విలువ ఆయా కంపెనీలను బట్టి రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు ఉంటుంది. నిరుపేద బాధితులు దాన్ని కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత కలిగి ఉండరు. అయితే కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా 'మేడ్ ఇన్ ఇండియా ఫర్ ది వరల్డ్' కింద వైద్య పరికరాలు, ఔషధాల తయారీని ప్రోత్సహిస్తోంది. చెన్నైలోని వి టైటాన్ కార్పొరేషన్ ఇన్‌ఫ్యూజ్ థల పంపును దేశీయంగా తయారు చేసి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇటీవల తలసీమియా రాష్ట్ర సొసైటీకి ప్రయోగాత్మకంగా పది థల పంపులను ఆ కంపెనీ అందజేసింది. ఆదిలాబాద్ జిల్లాలో మొదటి సారి ముగ్గురు బాధితులకు ఆ కంపెనీ ప్రతినిధులు వాటిని ఎంపీ గోడం నగేష్ చేతుల మీదుగా అందించారు.

విధిగా సూది మందు..

తలసీమియా, సికిల్‌సెల్ బాధితులు తరచూ రక్తం ఎక్కించుకోవటం వల్ల వారి శరీరంలో అత్యధికంగా ఐరన్ పేరుకుపోతుంది. శరీరంలోని అవయవాలు వ్యాధులకు గురై మృతి చెందే ప్రమాదం ఉంటుంది. బాధితుల శరీరంలో పేరుకుపోయిన ఐరన్‌ను తొలగించటానికి సూది మందు వేయించుకోవటం అత్యవసరం. ప్రత్యామ్నాయంగా మాత్రలు ఉన్నా వాటితో ఆశించిన ఫలితాలు ఉండవంటున్నారు.

చాలా సులువు..

ఇన్‌ఫ్యూజ్ పంపు ద్వారా సూది మందు వేసుకోవటం చాలా సులువుగా ఉంటుంది. సూది మందును పంపులో లోడ్ చేసి శరీరంపై ఎక్కడ దాన్ని తీసుకోవాలో అక్కడ ఆ పంపును బెల్ట్ ద్వారా బిగించేస్తే సరి. దానిలో ఏర్పాటు చేసిన సూది ద్వారా చర్మంలోకి నిర్ణీత మోతాదులో ఆ మందు వెళ్లిపోతుంటుంది. ఈ సమయంలో బాధితులు సాధారణ పనులన్నీ చేసుకోవచ్చు.

ప్రభుత్వం దృష్టి పెడితే మేలు..

సికిల్‌సెల్, తలసీమియా వ్యాధులు ఆరోగ్యశ్రీ పథకంలో ఉన్నాయి. ఇన్‌ఫ్యూజ్ పంపు, సూది మందులు మాత్రం అందులో లేవు. దేశీయంగా తయారు చేసిన థల పంపు కొనుగోలు చేయాలంటే రూ.20 వేలు భరించే ఆర్థిక స్తోమత పేద రోగులకు ఉండదు. సూది మందు సైతం బయట మార్కెట్‌లో రూ.200 ఉంటుంది. వీటిని ఆరోగ్యశ్రీలో చేర్చి ప్రభుత్వం ఉచితంగా అందజేస్తే మేలు చేసిన వారవుతారని బాధితులు కోరుతున్నారు.

గిరివనంలో సిరుల పంట

కుంటాల, న్యూస్‌టుడే: నేల స్వభావం, ఆ నేలలోని మూలకాలు, వాతావరణం, వేసే విత్తనాలు పంట దిగుబడిని నిర్ణయిస్తాయి. ఇదే రైతులకు లాభాన్ని తెచ్చేవి, నష్టాన్ని కలిగించేవి. కానీ చాలా మంది ఇవేవీ పట్టించుకోకుండానే పక్క రైతును చూసి, తామూ అదే సాగు చేస్తూ.. నష్టాల బారిన పడుతుంటారు. ఆ పరిస్థితికి భిన్నంగా ప్రతి పంటలో లాభం పొందడానికి కుంటాల మండలం అంబకంటి పంచాయతీ పరిధి హనుమాన్‌నగర్ తండా రైతులు కృషి చేస్తున్నారు.

నిత్యం ఆదాయం సమకూరేలా

సాగులో సమస్యలను పరిష్కరించుకోవడానికి రైతులు భిన్నంగా ఆలోచిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని ఫకీరామహారాజ్ రుజువు చేస్తున్నారు. ఆయనకు ఉన్న పదెకరాల్లో మూడు బోరుబావులున్నాయి. ఎకరంలో పత్తి, మినుము, అయిదెకరాల్లో పత్తి, కంది అంతర పంటలుగా, మూడెకరాల్లో పత్తి, మరో ఎకరంలో కూరగాయలు సాగు చేస్తున్నారు. టమాట, బెండ, బొబ్బెర, తీగచిక్కుడు, గోరుచిక్కుడు, దోసకాయ, బీర, కొత్తిమీర, మెంతి, పాలకూర ఇలా వివిధ పంటలు పండిస్తున్నారు. ఇక్కడి రైతులకు మొదట్లో బొప్పాయి పంటను పరిచయం చేశారు. ప్రస్తుతం మూడు రోజులకు ఒక్కసారి కూరగాయల దిగుబడి వస్తోంది. ఉమ్మడి కుటుంబం కావడంతో కూలీల సమస్య లేదు. దంపతులిద్దరు, ఇద్దరు కుమారులు, కోడళ్లు కూరగాయలు తెంపుతుంటారు. రవాణా, ఇతరత్రా ఖర్చులు పోను ప్రతి రోజు రూ.1200-1500 ఆదాయం సమకూరుతోంది. 33 మేకలు, పాడి గేదెలతో మరి కొంత అదనపు ఆదాయం లభిస్తోంది. 17 ఏళ్లుగా కూరగాయలు సాగులో ఉన్నారు. ఆధ్యాత్మికంలో ముందు వరుసలో ఉండటంలో ఈ ప్రాంతంలో మహారాజ్‌గా సుపరిచితుడయ్యారు.

ప్రణాళికతో లాభాల పంట


వంకాయలు తెంపుతున్న శ్రీరాం

సాగులో ముందు వరుసలో నిలుస్తూ తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారు రాఠోడ్ శ్రీరాం. ప్రణాళికతో లాభాల పంట పండిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. తనకు ఉన్న 20 ఎకరాల్లో అయిదు బోరుబావులు వేయించారు. రెండున్నర ఎకరాల్లో బిందు సేద్యం పరికరాలతో కూరగాయలు సాగు చేస్తున్నారు. 13 ఎకరాల్లో పత్తి, రెండున్నర ఎకరాల్లో వరి, 2 ఎకరాల్లో మిర్చి పంట వేశారు. రెండున్నర ఎకరాల్లో అర ఎకరం బొప్పాయి, బెండ, టమాట, చిక్కుడు, బీర, వంకాయ, తదితర పంటలు వేశారు. దంపతులతో పాటు ఓ పాలేరు, అవసరమైనప్పుడు కూలీలతో పనులు చేస్తున్నారు. ధరలు బాగా ఉంటే కూరగాయల ద్వారా నెలకు రూ.60వేల వరకు ఆదాయం లభిస్తోంది. అందులో రూ.20 వేల వరకు ఖర్చులు ఉంటున్నాయి. వివిధ వారసంతల్లో కూరగాయలు విక్రయిస్తుంటారు.


బొబ్బెరకాయలు కోస్తున్న ఫకీరామహారాజ్

ఉన్నత లక్ష్యాలతో చదవాలి

సారంగాపూర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి జె.పరశురాం అన్నారు. శుక్రవారం మండలంలోని చించోలి(బి) మైనార్టీ గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రకాష్, మామడ కళాశాల ప్రిన్సిపల్ రవికిరణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జామ్ గురుకుల ప్రిన్సిపల్‌గా రాధిక



సారంగాపూర్, న్యూస్‌టుడే: మండలంలోని జామ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా సాధిగె రాధిక నియమితులయ్యారు. శుక్రవారం విద్యాలయాన్ని సందర్శించిన ఆమె బాధ్యతలు చేపట్టారు. రైట్ పోచంపాడ్ గురుకులంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న రాధిక కడెం నచ్చన్ ఎల్లాపూర్ గురుకుల విద్యాలయ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా పనిచేశారు.

నిరుద్యోగుల పక్షాన పోరాడతా


సమావేశంలో మాట్లాడుతున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ వి.నరేందర్‌రెడ్డి

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో జరిగే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోటీల్లో తాను ఈసారి బరిలో నిలువనున్నట్లు అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 సంవత్సరాలుగా విద్యారంగంలో సేవలందిస్తూ విద్యావేత్తగా అనుభవం ఉన్న తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరుద్యోగులకు అండగా ఉంటానన్నారు. నిరుద్యోగుల పక్షాన పోరాడేందుకు బలం పెంచే విధంగా ఈ సారి వంద శాతం ఓటు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అర్హులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోవద్దని, పట్టభద్రుల్లో చైతన్యం పెంచే లక్ష్యంతో గత 15 రోజుల నుంచి తమ ప్రతినిధులతో ఓటు నమోదు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన పార్టీనుంచి టికెట్ ఆశిస్తున్నానన్నారు. టికెట్ వస్తే పార్టీ తరఫున పోటీ చేస్తానని, లేదంటే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని స్పష్టం చేశారు. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

తొలిరోజు 30 మంది హాజరు



పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : డీఎస్సీ-2008లో ఎంపికైన బీఎడ్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం ఆదిలాబాద్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో ప్రారంభమైంది. తొలిరోజున మంచిర్యాల, నిర్మల్, కుమురం భీం, ఆదిలాబాద్ జిల్లాల నుంచి 30 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అక్టోబరు 5వ తేదీ వరకు పరిశీలన కొనసాగుతుందని డీఈవో ప్రణీత తెలిపారు. కమిటీ సభ్యులు సుకుమార్, మహేందర్‌రెడ్డి అభ్యర్థులు పూరించిన పత్రాలతో పాటు ఆయా ధ్రువపత్రాలను పరిశీలించారు.

ఆలయాల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు తేవాలి


మాట్లాడుతున్న కమలానందభారతి స్వామి

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: హిందూ ఆలయాల సంరక్షణ కోసం తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని గన్నవరం భువనేశ్వర మఠం పీఠాధిపతి కమలానంద భారతి స్వామి కోరారు. జిల్లాకేంద్రానికి వచ్చిన ఆయన స్థానిక నటరాజ్‌నగర్‌లోని ఉమామహేశ్వర ఆలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో లడ్డూప్రసాద తయారీలో జరిగిన కల్తీ విషయం ప్రస్తుత హిందూ సమాజాన్ని గాయపర్చిందన్నారు. ఈ నేపథ్యంలో మాజీ సీఎం జగన్ తిరుపతి పర్యటనపై అభ్యంతరం వ్యక్తంచేశారు. వ్యక్తిగతంగా క్రైస్తవ మత సిద్ధాంతం ఆచరించే ఆయన నిజాయతీగా వ్యవహరించాలని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఆచార వ్యవహారాలను దెబ్బతీసే ప్రయత్నం చేయొద్దని, ఓట్ల కోసం హిందువుల్లాగా నటించొద్దని హితవు పలికారు. ఎవరి మతాచారాలు వారివేనని, ఎవరికివారు స్వేచ్ఛగా ఆచరించుకోవచ్చని, అదే సమయంలో అన్నింటినీ గౌరవించాలన్నారు. హిందూ ఆలయాలకు అన్యమతస్థులు రావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఒకవేళ వెళితే అక్కడి దైవాన్ని నమ్ముతున్నామనే అంగీకారం తెలపాలని సూచించారు. రాజకీయ నాయకత్వం నచ్చితే నాయకులు ఏ మతం వారైనా ఓట్లు వేస్తారని, కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం తమ చేతల ద్వారా మతవైషమ్యాలు తీసుకురావొద్దని చెప్పారు. సమావేశంలో విభాగ్ ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ పతికె రాజేందర్, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి మూర్తి ప్రభాకర్, మాతృశక్తి ప్రాంత సహ సంయోజిక సద్ది శ్రీవాణి, జిల్లా సహ సంయోజిక సిరి, నాయకులు చింతకుంట శ్రీనివాస్, పతికె రమేశ్, అయ్యన్నగారి భూమయ్య, భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముథోల్(బాసర): బాసర అమ్మవారిని శుక్రవారం కమలానందస్వామి దర్శించుకొన్నారు. వేదపండితులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కుంకుమపూజ, మహాహారతి, తదితర పూజలను నిర్వహించారు. భాజపా నాయకులు సతీశ్వర్‌రావు, సుభాష్‌యాదవ్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ వాలంటీర్ల ఎంపిక

నిర్మల్ గ్రామీణం: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ వాలంటీర్ల ఎంపిక శుక్రవారం నిర్వహించారు. విద్యార్థుల శరీర సౌష్టవం, దారుఢ్య పరీక్షలను హవాల్దార్ నరేష్‌కుమార్ నాయబ్ సుబేదార్ సునీల్‌కుమార్ నిర్వహించి 40 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.ఎం.సుధాకర్, డా.గంగాధర్, ఎన్‌సీసీ సమన్వయకర్త ఉమేష్, నరేందర్, సూర్యసాగర్, డా.రంజిత్, మురహరి పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి వెళ్లిన ఉద్యమకారులు

భైంసా: హైదరాబాదులో తలపెట్టిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనానికి నియోజకవర్గ ఉద్యమకారులు శుక్రవారం భైంసా నుంచి బయలు దేరారు. వారిలో జిల్లా ఫోరం అధ్యక్షుడు డా.రామకృష్ణాగౌడ్, ఆయా మండలాల నాయకులు జె.పుండలిక్‌రావు, వి.నాగోరావు, కె.రాంచందర్‌రావు, కొత్తూరు శంకర్, పుప్పాల పీరాజీ, గడ్డం మహేందర్ గౌడ్, వడ్నపు దత్తాత్రి, రాములు, సాయినాథ్ తదితరులు ఉన్నారు.

ముగిసిన ఇంధన వనరుల సదస్సు

ముథోల్(బాసర): బాసర ఆర్జీయూకేటీలో వారం రోజుల నుంచి సాగుతున్న ఇంధన వనరుల సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఇందులో విద్యార్థులకు ఉపయోగకరమైన విషయాలను తెలియజేసిన అధ్యాపకులకు పరిపాలన విభాగం అధికారి రణధీర్, ఇతర అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజులలో ఈ సదస్సు బాగా ఉపయోగపడుతుందని చెప్పారు.


కుంటాల: ఆదర్శ పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు

కుంటాల: అంకితభావంతో పని చేస్తే చక్కటి గుర్తింపు లభిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. జిల్లాలోని ఏకైక ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు 12 ఏళ్ల అనంతరం ఇటీవల బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు పాఠశాలలో శుక్రవారం వీడ్కోలు, స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ప్రసాద్, మురళి, ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మాజీ ఎంపీపీ అప్పగజ్జారాం, నాయకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


వేదికపై రాజయ్య ప్రసంగాన్ని అడ్డుకుంటున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్

రాజయ్య ప్రసంగాన్ని అడ్డుకున్న భారాస ఎమ్మెల్యే

బోథ్, న్యూస్‌టుడే : బోథ్‌లో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి శుక్రవారం రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగాన్ని భారాస ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అడ్డుకోవడం ఉద్రిక్తతకు దారి తీసింది. రాజయ్య మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీతో తనకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఇవ్వకపోయి ఉంటే ప్రజలు ఎవరిని తిట్టుకునేవారని? ఇస్తే ఎవరికి లాభం జరగాలి? కానీ ఎవరికి లాభం జరిగింది.. ఎవరు పదవులను అనుభవిస్తున్నారని ప్రశ్నించారు. బాపూజీ అంత్యక్రియలు ఆయన సొంత స్థలం జలసౌదలో నిర్వహించాలని నేను పట్టుబట్టానన్నారు. కొందరు నన్ను భయపెట్టారని అన్నారు. భారాస ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆగ్రహంతో ఆయన ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు అనిల్ జాదవ్‌ను ఆపారు. రాజయ్య ప్రసంగాన్ని ముగించే వరకు సమావేశంలో నిరసన వ్యక్తం చేస్తూ అలాగే నిలబడి ఉన్నారు. ఇలాంటి మాటలు మాట్లాడాల్సిన సమయం కాదని, సమావేశంలో ఎలా మాట్లాడాలో తెలుసుకోవాలని అనిల్ జాదవ్ మండిపడ్డారు. నేను భారాస గురించి మాట్లాడటం లేదని రాజయ్య జవాబిచ్చారు. రాజయ్య తన ప్రసంగాన్ని ఆపకపోవటంతో పలువురు పద్మశాలీ సంఘం నాయకులు కల్పించుకొని సమావేశాన్ని ఆపించారు.

విద్యుత్తు శాఖలో బదిలీల విధివిధానాలు విడుదల

మంచిర్యాల సిటీ: ఎట్టకేలకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని విభాగాల బదిలీలకు రంగం సిద్ధమైంది. విధివిధానాలతో కూడిన ఉత్తర్వులు సైతం జారీ అయ్యాయి. జూన్ 30వరకు ఒకేచోట రెండేళ్లు పూర్తిచేసుకున్న వారందరూ బదిలీకి అర్హులే అని అందులో పేర్కొన్నారు. వచ్చేనెల ఏడో తేదీ వరకు ఈ ప్రక్రియ పూర్తి కానుంది. జిల్లాలో పాతుకుపోయిన సిబ్బంది, సంఘాల నాయకులు, వారి అనుచరులకు తప్పితే మిగతా వారికి ఉపయోగం అంతంత మాత్రమే అని సంస్థలోని ఉద్యోగుల నుంచే విమర్శలు వస్తున్నాయి. శనివారం సాయంత్రం వరకు బదిలీకి అర్హత ఉన్నవారి వివరాలు అందించాలని ఆదేశాలు రావడంతో ఎస్ఈ కార్యాలయ సిబ్బంది అందులో నిమగ్నమయ్యారు.

శభాష్.. శివ!

- యూట్యూబర్‌గా రాణిస్తున్న పల్లెటూరి కుర్రాడు



సాధించిన గోల్డెన్ ప్లే బటన్‌తో.. శివ

తెలుగు మాధ్యమంలో చదివిన ఆ పల్లెటూరి కుర్రాడు బీటెక్‌లో చేరగానే ఆంగ్లంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రాజెక్టు వర్క్‌లు, ప్రజెంటేషన్లు ఇచ్చే సమయంలో ఆ భాషలో మాట్లాడేందుకు తన లాగే చాలా మంది బాధపడుతున్నారని గుర్తించారు. దీన్ని అధిగమించేందుకు సులువైన మార్గాలను అన్వేషించారు. యానిమేషన్ ద్వారా చెబితే అర్థం చేసుకోవచ్చని భావించి యూట్యూబ్ ద్వారా మూడు భాషల్లో వీడియోలు రూపొందించి ఆంగ్ల పాఠాలు బోధిస్తూ యూట్యూబర్‌గా రాణిస్తున్నారు. -న్యూస్‌టుడే, భైంసా గ్రామీణం

నిర్మల్ జిల్లా భైంసా మండలం లింగా-1 గ్రామానికి చెందిన గాడేకర్ శివ.. ప్రాథమిక, మాధ్యమిక విద్యాభ్యాసమంతా తెలుగు మాధ్యమంలోనే పూర్తిచేశారు. ఇంజినీరింగ్(సివిల్) ఆంగ్ల మాధ్యమం కావడంతో చేరినప్పటి నుంచి ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా ప్రాజెక్టు వర్కులు, ప్రజెంటేషన్లు ఇచ్చే క్రమంలో. ఆంగ్ల భాషను ఎక్కడ, ఎలా నేర్చుకోవాలో తెలియని అయోమయ స్థితి ఎదురైంది. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి తనలాగే సమస్య ఉందని గుర్తించి ఎలాగైనా దీన్ని గట్టెక్కాలని నిర్ణయించుకున్నారు.


గాడేకర్ శివను అభినందిస్తున్న భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్



శివ యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన మూడు భాషల వ్యాఖ్యలు

పది లక్షలకు పైగా వీక్షకులు

గూగుల్, యూట్యూబ్‌లను అనుకూలంగా మార్చుకుని మొదట ఆయన ఆంగ్లంపై పట్టు సంపాదించారు. దీని కోసం రాత్రింబవళ్లు కష్టపడ్డారు. యానిమేషన్ (బొమ్మలతో)లో చెబితే చక్కగా అర్థం చేసుకోవచ్చని నిర్ణయానికి వచ్చారు. తెలుగు, హిందీ, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో యానిమేషన్‌లో పాఠాలు రూపొందించి యూట్యూబ్ ఛానల్ 'గాడేకర్ శివ' ద్వారా వీడియోలు పొందుపర్చారు. ఇలా అయిదేళ్లలో 259 వీడియోలు అప్‌లోడ్ చేయగా.. 10,14,000 మంది సబ్‌స్క్రైబర్లుగా (వీక్షకులు) చేరారు. ఈ వీడియోలను 5,84,49,000 మందికి పైగా వీక్షించారు. శివ ప్రతిభను గుర్తించిన యూట్యూబ్ ఇటీవల గోల్డెన్ ప్లేబటన్ (బంగారు పలక) పంపించింది.

అరబ్ దేశాల నుంచి ఆదరణ

స్పోకెన్ ఇంగ్లిష్, భాషా నైపుణ్యంపై పాఠాలను కొత్తగా రూపొందిస్తున్నారు. సందర్భానుసారంగా ఆంగ్ల పదాలు, వ్యాఖ్యలు, యానిమేషన్ చిత్రాలతో రూపొందించిన వీడియోలు చక్కటి ఆదరణ పొందుతున్నాయి. వీడియోలకు తానే వ్యాఖ్యానం ఇస్తున్నారు. మొదట తెలుగు, హిందీ, భాషల్లో వీడియోలు చేశారు. అరబ్ దేశాల్లోని వీక్షకులు ఉర్దూలో కావాలని కోరడంతో.. హిందీలో వారికి పంపి ఉర్దూలో తర్జుమా చేయించారు. అలా ఉర్దూలోనూ వీడియోలు అప్‌లోడ్ చేస్తున్నారు. తన వీడియోల ద్వారా కోటి మంది వీక్షకులను చేర్పించి డైమండ్ ప్లే బటన్ సాధించడమే తన లక్ష్యమని శివ చెబుతున్నారు.

వెలుగులోకి పురాతన భైరవ విగ్రహం


కుంటాలలో భైరవ విగ్రహం చూపుతున్న దేవరావు

కుంటాల, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా కుంటాలలోని ప్రాచీన గ్రామదేవత గజ్జలమ్మ ఆలయానికి తూర్పున సుమారు వంద మీటర్ల దూరంలో క్రీస్తు శకం 6వ శతాబ్దానికి చెందిన రాష్ట్రకూట రాజు చెక్కిన భైరవుని విగ్రహాన్ని శుక్రవారం గుర్తించినట్లు ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు తుమ్మల దేవరావ్ తెలిపారు. రాష్ట్రకూటుల కాలంలో ఈ గ్రామం వైభవంగా వెలిగినట్లు ఇక్కడ వెలుగులోకి వచ్చిన విగ్రహాలతో తెలుస్తోంది. భైరవ సంప్రదాయం ఇక్కడ కొనసాగినట్లు ఇక్కడ శిల్పసంపద తేటతెల్లం చేస్తోంది. నిర్మల్ జిల్లా ప్రాంతం రాష్ట్రకూట రాజు 2వ కృష్ణుని ఏలుబడిలో ఉన్నట్లు దిలావర్‌పూర్‌లో వెలుగులోకి వచ్చిన శాసనం వల్ల తెలుస్తోంది. వెలుగులోకి వచ్చిన భైరవ విగ్రహంలో పెద్ద దమ్మిల్లా జటాజూటం, పెద్ద కుండలాలు, కర్ణాభరణాలు, మెడలో హారంతోపాటు కాపాలజంధ్యం, నిజహస్తాల్లో కత్తి, రక్తంతో కూడిన పాత్ర, పరిహస్తాల్లో దండకం డమరుకం ఉన్నాయి. దండకడియాలు, ముంజేతి కంకణాలు, మొలతాడు కలిగి త్రిభంగిమలో వైతస్తిక పాదభంగిమలో ఉన్నాడు. కాళ్లకింద సర్పవాహనం ఉండే అవకాశం ఉంది. కానీ భూమిలో కుంగిపోయి ఉన్నందున వాటిని గుర్తించలేకపోయామని దేవరావ్ వివరించారు. విగ్రహ లక్షణాలు బట్టిచూస్తే అష్ట భైరవుల్లో కాల భైరవునిగా చెప్పొచ్చు. ఇదే కాకుండా 16వ శతాబ్దపు మరో విగ్రహం ఈ ప్రాంతంలో గుర్తించామని, ఆ భైరవుని లక్షణాలు కూడా రాష్ట్రకూట భైరవుని విగ్రహం పోలి ఉన్నాయని పేర్కొన్నారు. క్షేత్ర పర్యటనలో చరిత్ర పరిశోధకులు అబ్బిడి రాజేశ్వర్‌రెడ్డి, తుమ్మల సుజాత పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా బోధించాలి

సారంగాపూర్: తరగతి గదిలో విద్యార్థులకు బోధన ప్రణాళికాబద్ధంగా జరగాలని మండల విద్యాధికారి జి.మధుసూదన్ అన్నారు. శుక్రవారం మండలంలోని చించోలి(బి) ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులకు రూమ్ టు రీడ్ సంస్థ ఏర్పాటు చేసిన ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆ సంస్థ అందించిన పుస్తకాలను పాఠశాలల గ్రంథాలయాల్లో విద్యార్థులతో క్రమం తప్పకుండా చదివించాలని సూచించారు.

30న నిరసన ప్రదర్శన

నిర్మల్ పట్టణం: తిరుపతిలో శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూప్రసాద విషయంలో జరిగిన అపవిత్రతను వ్యతిరేకిస్తూ విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 30న నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు సంఘ బాధ్యులు తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట జరిగే కార్యక్రమంలో హిందువులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలి


అల్పాహార తయారీ విధానాన్ని అడిగి తెలుసుకుంటున్న డీఆర్డీవో విజయలక్ష్మి

సారంగాపూర్, న్యూస్‌టుడే : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థిక శక్తిగా ఎదగాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం సారంగాపూర్ మండల కేంద్రంలో స్థానిక వీరాంజనేయ గ్రామ మహిళా సంఘం సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆమె ప్రారంభించారు. క్యాంటీన్ నిర్వాహకులు తయారు చేసిన అల్పాహారాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకాంతారావు, ఎంపీవో అబ్దుల్ అజిత్‌ఖాన్, డీపీఎం సాయిప్రసద్, ఏపీవో లక్ష్మారెడ్డి, ఏపీఎం మాధురి, ఐకేపీ సీసీలు, మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై సమీక్ష


సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, లీడ్ బ్యాంకు మేనేజరు రాంగోపాల్, బ్యాంకు అధికారులు

నిర్మల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాల అమలు, పీఎం విశ్వకర్మ, పీఎం స్వానిధి, పంట రుణాలపై శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు పాలనాధికారి కిషోర్ కుమార్ వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. జిల్లా క్రెడిట్ ప్లాన్, ఆర్థిక చేరిక కింద పురోగతి, సామాజిక భద్రత పథకాలపై చర్చించారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లు, డీఆర్‌డీఏ, డీఐసీ ద్వారా బ్యాంకర్లు సందేహాలు నివృత్తి చేశారు. లీడ్ బ్యాంకు మేనేజరు రాంగోపాల్, వివిధ శాఖలు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఆదుకోవాలని విన్నపం


దివ్య దేవరాజన్‌కు సమస్యలను వివరిస్తున్న ప్రవాసిమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల

నిర్మల్, న్యూస్‌టుడే: గల్ఫ్ దేశాల్లో ఉపాధి కోసం వెళ్లి మరణించిన వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రవాసి ప్రజావాణి విభాగంలో ప్రవాసిమిత్ర కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల ఆధ్వర్యంలో బాధితులకు విన్నవించారు. ఈ సందర్భంగా సీఎం ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌కు గల్ఫ్ బాధితుల సమస్యలను వివరించారు. సంఘం సమన్వయకర్త కొమ్ము గీత, గల్ఫ్‌లో మృతిచెందిన కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు ఆత్మీయ వీడ్కోలు

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన ప్రిన్సిపల్ శంకర్, అధ్యాపకులు సత్యపాల్ రెడ్డి, విజయలక్ష్మి, ఓం ప్రకాష్, కార్యాలయ ఉద్యోగి హఫీజ్ ఉస్మాన్‌లకు శుక్రవారం కళాశాల అధ్యాపకులు విద్యార్థులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్, అధ్యాపకులు పాల్గొన్నారు.


భైంసాలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పద్మశాలి సంఘం ప్రతినిధులు


తానూరు మార్కండేయ ఆలయంలో..


కుంటాల: కల్లూరులో ..

స్ఫూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజీ

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. స్ఫూర్తి ప్రదాత సేవలను కొనియాడారు.

- న్యూస్‌టుడే బృందం


లోకేశ్వరం మండలం అబ్దుల్లాపూర్‌లో పద్మశాలి సంఘ నాయకులు..


నిర్మల్ : కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీఎన్జీవోస్ సంఘ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు


కుభీరులో తహసీల్దార్ సోము, సిబ్బంది..


సారంగాపూర్‌లో తహసీల్దార్ శ్రీదేవి..


లక్ష్మణచాందలో తహసీల్దార్ జానకి, అధికారులు..


ఖానాపూర్: విద్యానగర్ పద్మశాలి సంఘ భవనంలో...


పెంబిలో..


దస్తూరాబాద్‌లో..

ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే


ముథోల్‌లో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

ముథోల్, న్యూస్‌టుడే: ముథోల్ ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ముథోల్ ప్రభుత్వ ఆసుపత్రిని వైద్యులు, గ్రామస్థులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. సూపరింటెండెంట్ అనిల్‌కుమార్‌తో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరణోత్తర పరీక్షలు నిలిచిన విషయం తెలుసుకుని పోస్టుమార్టం గదిలో సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. బోరుబావి ఏర్పాటు, మరమ్మతులు చేపడుతామని చెప్పారు. డయాలసిస్ కేంద్రానికి ముథోల్ వీడీసీ, గ్రామస్థుల సహకారంతో మరమ్మతులు చేయిస్తామన్నారు. ఇతర సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. నాయకులు సర్వాగౌడ్, రోళ్లరమేష్, తాటిబారి రమేష్, సతీష్‌రెడ్డి, భూమేష్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముథోల్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఎమ్మెల్యే అన్నారు. ముథోల్‌లోని పశుపతినాథ్ శివాలయంలో ముథోల్ అంగన్‌వాడీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ మాసం నిర్వహించారు. అంగన్‌వాడీలకు సరఫరా చేసే పదార్థాలతో పిండివంటలు తయారు చేసి ప్రదర్శించారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. ఎంపీడీఓ శివకుమార్, తహసీల్దార్ శ్రీకాంత్, సీడీపీఓ సరోజ, నాయకులు పాల్గొన్నారు.

భైంసా: విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని ఉపాధ్యాయులు వెలికి తీసి ఆ దిశగా వారిని ప్రోత్సహిస్తే భావి శాస్త్రవేత్తలు అవుతారని ఎమ్మెల్యే అన్నారు. ఐటీఐలో జిల్లా స్థాయి వైజ్ఞానిక సదస్సులో పట్టణంలోని విజన్ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన 'మహిళలు- పిల్లల రక్షణ'పై శ్రీవర్ష, ప్రతీక్ష ప్రదర్శించిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు శుక్రవారం విద్యార్థులను అభినందించి భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.

పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలి : భాజపా

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వాలు, ప్రస్తుత ఎన్డీయే పాలనకు మధ్య ఉన్న తేడాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని భాజపా జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నిర్మల్ గ్రామీణ మండల సభ్యత్వ సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రతీ పోలింగ్‌బూత్ పరిధిలో పార్టీ సభ్యత్వ నమోదును ఈనెల 30 లోపు పూర్తిచేయాలని సూచించారు. ఉత్తమ పనితీరు కనబర్చిన సాయన్న, నర్సారెడ్డి, ఏనుగు వెంకట్‌రెడ్డి, ఎం.సి.నర్సయ్య, లవకుమార్‌గౌడ్‌ను సత్కరించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు అలివేలు మంగ, సభ్యత్వ నమోదు కన్వీనర్ కమల్ నయన్, నాయకులు తోకల అనిల్, ముచ్చిండ్ల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హిందూ ధార్మిక పోటీలు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శనివారం హిందూ ధార్మిక పోటీలు నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూపరిషత్ బాధ్యులు తెలిపారు. హిందూ ధర్మరక్షణకై మీ వంతు పాత్ర అనే అంశంపై వ్యాసరచన, రామాయణం, మహాభారతం, భాగవతం, జీకేపై క్విజ్, దేశభక్తి- దైవభక్తి గీతాలాపన, హనుమాన్ చాలీసా పఠనంపై పోటీలుంటాయన్నారు. 8-10 తరగతుల విద్యార్థులెవరైనా పాల్గొనవచ్చన్నారు. దేవరకోట దేవస్థానంలో ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, ప్రతీ పాఠశాల నుంచి 10 మంది విద్యార్థులు పాల్గొనేందుకు అవకాశముందని వివరించారు.

కుటుంబాన్ని కాపాడారు..!

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో విసిగి వేసారిన ఆ వివాహిత తన ముగ్గురు పిల్లలతో కలిసి బలవన్మరణానికి యత్నించారు. సకాలంలో అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని రక్షించారు. స్థానికులు తెలిపిన వివరాలిలా.. పట్టణానికి చెందిన ఓ వివాహితకు ముగ్గురు పిల్లలు. చిన్నచిన్న పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. తరచూ భర్తతో గొడవలు జరుగుతుండటంతో ఆమె మనస్తాపానికి గురయ్యారు. శుక్రవారం ఉదయం తన ముగ్గురు పిల్లలను తీసుకొని పట్టణంలోని వినాయకసాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు బయలుదేరారు. దీంతో ఆమె భర్త వెంటనే డయల్ 100కు కాల్‌చేసి విషయాన్ని వివరించి సాయం కోసం అభ్యర్థించారు. సమాచారం అందుకున్న బ్లూకోట్ సిబ్బంది అజర్‌ఖాన్, రాథోడ్ అనిల్ హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అప్పటికే చెరువునీటిలోకి దిగిన మహిళ, ఆమె పిల్లలను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అనంతరం పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో భార్య, భర్తకు కౌన్సెలింగ్ నిర్వహించి ఇంటికి పంపించారు. సకాలంలో స్పందించి నలుగురి ప్రాణాలు కాపాడిన సిబ్బందిని అభినందిస్తూ వారికి నగదు బహుమతి అందజేశారు.

కుమారులు పట్టించుకోవడం లేదని..

ఖానాపూర్, న్యూస్‌టుడే: పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన 70 ఏళ్ల బోదాసు సాయవ్వ తనను కుమారులు, కూతుళ్లు, కట్టుకున్న భర్త పట్టించుకోకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో పట్టణశివారులో గోదావరిలో దూకారు. దగ్గరలోనే ఒడ్డున ఉన్న జాలర్లు నీటిలో కొట్టుకుపోతున్న వృద్ధురాలిని రక్షించి బయటకు తీసుకొచ్చారు. డయల్ 100కు కాల్ చేసి సమాచారమివ్వడంతో బ్లూకోల్ట్ సిబ్బంది వృద్ధురాలిని ఠాణాకు తీసుకొచ్చారు. కుమారులు, కూతుళ్లను ఠాణాకు పిలిపించిన సీఐ సైదారావు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని పంపించారు.


పోషక పదార్థాలను ప్రదర్శిస్తున్న రాజూర సత్యం

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఖానాపూర్ గ్రామీణం: మండలంలోని సత్తనపల్లి రైతు వేదికలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తూరాబాద్, మామడ మండలాల అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ రాజూర సత్యం హాజరై మాట్లాడారు. అనంతరం ప్రి స్కూల్ కార్యక్రమంలో భాగంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే ఆహార పదార్థాలను ప్రదర్శించి, పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. సీడీపీవో సరిత, ఎంపీడీవోలు సునీత, రమాకాంత్, వైద్యాధికారి శాంతన్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ ప్రేమలత, శ్రీలత, నాయకులు పాల్గొన్నారు.

'కడెం' సరే.. దారిని పట్టించుకోరే..


అడుగడుగునా గుంతలే

కడెం, న్యూస్‌టుడే : వరదగేట్లు మొరాయించి గడిచిన రెండేళ్లు ప్రమాదకర స్థితిలోకి వెళ్లిన కడెం జలాశయంకు రూ.కోట్లు మంజూరు చేసి మెరుగుపర్చారు. అది సంతోషకర విషయమే. అయితే ప్రాజెక్టుకు వెళ్లే దారిని మాత్రం ఏళ్లుగా పట్టించుకోకపోతుండడం విమర్శలకు దారితీస్తోంది. నాలుగేళ్లక్రితం మంజూరైన నిధులతో ప్రాజెక్టుకు వెళ్లే దారికి తారువేసి మెరుగుపర్చాల్సి ఉండగా గుత్తేదారు పనిచేయక నిధులు వెనక్కుపోయాయి. మళ్లీ మంజూరుకు ప్రతిపాదనలు పంపినా స్పందన లేదు. దీంతో చినుకు పడితే చాలు గుంతల్లో నీరు నిండి ప్రమాదకరంగా మారుతున్నాయి. రోడ్డు కొత్తగా నిర్మించేవరకు కనీసం బ్లేడు ట్రాక్టర్‌తో చదును చేయించి గుంతలు పూడ్చేసినా వచ్చిపోయే వారికి ఇబ్బందులు తప్పుతాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈవిషయమై అధికారులను అడిగిన ప్రతిసారీ ఉన్నతాధికారులకు నివేదించామనే సమాధానమే వస్తోంది.

జౌళినాలా ఇలా.. చివరికి నీరు చేరేదెలా..


రెండు చోట్ల కూలిన కాలువ గోడ

సారంగాపూర్, న్యూస్‌టుడే: స్వర్ణ ప్రాజెక్టు సాగునీటి కాలువల దుస్థితి దయనీయంగా ఉంది. ప్రధాన కాలువ జౌళినాలాతో పాటు కుడి, ఎడమ కాలువలు అనేక చోట్ల శిథిలమయ్యాయి. సారంగాపూర్ సమీపంలో ప్రధాన కాలువ గోడ రెండు చోట్ల శిథిలమైంది. వర్షాలు క్రమం తప్పకుండా కురుస్తుండటంతో ఈ ఏడాది ప్రాజెక్టు నీటి విడుదల, సరఫరా ప్రభావం కనిపించడం లేదు. నీటిని దిగువకు ఎక్కువగా విడుదల చేస్తే కాలువ శిథిలమైన చోట నుంచి సాగునీరు బయటకు వెళ్లే అవకాశముంది. దీంతో చివరి ఆయకట్టుకు నీరు చేరడం కష్టంగానే ఉంటుంది. అధికారులు స్పందించి కాలువకు మరమ్మతులు చేసి చివరి ఆయకట్టుకు నీరు చేరేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

కర్రకాదది.. ప్రమాదపు హెచ్చరిక


రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన కర్ర

చిత్రం చూడగానే.. అరె ఎవరో రహదారి మధ్యలో కర్రను ఉంచారు.. ఎందుకలా చేశారని విస్తుపోతున్నారా? ప్రమాదాన్ని హెచ్చరిస్తూ చేసిన ఏర్పాటది. మార్గంలో ఏర్పాటు చేసిన పైప్‌లైన్ దెబ్బతినడంతో అక్కడ గుంత ఏర్పడింది. దగ్గరకు వెళ్లేవరకు దాన్ని గుర్తించే అవకాశం లేకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో స్థానికంగా ఉన్నవారు ఇలా ఓ కర్రను ఆ గుంతలో ఏర్పాటు చేసి ఆ మార్గంలో వెళ్లేవారిని అప్రమత్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్ నుంచి సాగర్ కాలనీ వెళ్లే మార్గంలో నందన డిగ్రీ కళాశాల సమీపంలో కనిపించిన దృశ్యమిది. -నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే

ఆటల్లోనూ రాణించాలి: డీఈవో


గుండంపల్లిలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

దిలావర్‌పూర్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే చదువుతోపాటు ఆటలను దినచర్యలో చేర్చుకోవాలని డీఈవో రవీందర్ రెడ్డి అన్నారు. మండలంలోని గుండంపల్లిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-17 బాలబాలికల పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆటల్లో ప్రతిభ కనబరిస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక అవకాశాలు ఉంటాయన్నారు. ఎంఈఓ శంకర్, కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు సదానందం, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి భోజన్న, ఎంపీవో గోవర్ధన్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాడాలి

నిర్మల్, న్యూస్‌టుడే: విద్యారంగ సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పోరాడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.నరేందర్ అన్నారు. శుక్రవారం స్థానిక టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించిన పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభలో మాట్లాడారు. పీడీఎస్‌యూ చరిత్ర అజరామమని, శాస్త్రీయ విద్యా విధానం కోసం ఉద్యమిస్తుందని చెప్పారు. విద్యార్థులతో కలిసి గాంధీపార్కు నుంచి టీఎన్జీవోస్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కట్ల రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమంపై అవగాహన

నిర్మల్, న్యూస్‌టుడే : అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా న్యాయ సేవా సంస్థ, జిల్లా సంక్షేమశాఖ, వయోవృద్ధుల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పెన్షనర్ల సంఘ భవనంలో వయోవృద్ధుల సంక్షేమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వయో వృద్ధుల పోషణ చట్టం-2007, నిబంధనలు, సంక్షేమం, ఆరోగ్యం, తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సి.లింగన్న, కార్యదర్శులు హన్మంత్‌రెడ్డి, పి.వికాస్, సీడీపీవో నాగమణి, ఏసీడీపీవో నాగలక్ష్మి, న్యాయవాదులు లింగాగౌడ్, రాజలింగం, నరేందర్, మధుకర్, జిల్లా సంక్షేమశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరి నదిలో మహిళ గల్లంతు


జయ

బాసర(ముథోల్), న్యూస్‌టుడే: గోదావరి నదిలో పుణ్యస్నానానికి కుటుంబంతో కలిసి వచ్చిన ఓ మహిళ గల్లంతయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా.. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ధర్మారం గ్రామానికి చెందిన జయ(45) కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం బాసర సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఆమె భర్త ఏడాది కిందట అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి పుట్టింటి గ్రామమైన ధర్మారంలో ఉంటున్నారు. మూడు నెలల కిందట జయ తల్లి కన్నుమూశారు. దసరా పండుగ నేపథ్యంలో గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించాలని వేద పండితులు చెప్పడంతో తన ఇద్దరు కూతుళ్లు, తమ్ముడు, మరదలు, తండ్రి తదితరులతో ఉదయం బాసరకు చేరుకున్నారు. గోదావరిలో పుణ్యస్నానానికి మరదలు కృష్ణవేణి, జయ వెళ్లారు. ఎగువన వర్షాలు కురవడంతో గోదావరిలో నీటి ప్రవాహం పెరిగింది.

నేర వార్తలు

దీంతో జయ ప్రవాహంలో కొట్టుకుపోయారు. కృష్ణవేణిని భక్తులు, గజ ఈతగాళ్లు కాపాడారు. బాసర ఎస్సై గణేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గల్లంతైన మహిళ ఆచూకీ కోసం గాలిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మూర్ఛ వ్యాధితో నీట మునిగి ఒకరి మృతి

తానూరు(భైంసా), న్యూస్‌టుడే: మండలంలోని మహాలింగి గ్రామానికి చెందిన తురాటి(బర్కం) విఠల్(35) శుక్రవారం నీటి కుంటలో పడి మృతి చెందారు. స్థానికులు, ఎస్సై డి.రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. విఠల్ మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నారు. ఉదయం గ్రామ సమీపంలోని చెరువు కుంట గట్టుపైకి బహిర్భూమికని వెళ్లారు. ఈ క్రమంలో మూర్ఛ రావడంతో కుంటలో పడి నీట మునిగి మృతి చెందారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఆరేళ్ల లోపు ఇద్దరు కుమారులు ఉన్నారు.

దొంగతనానికి యత్నించి పట్టుబడిన దుండగులు

తానూరు(భైంసా), న్యూస్‌టుడే: పట్టపగలే తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీకి యత్నించిన దుండగులను స్థానికులు పట్టుకుని తాళ్లతో కట్టేసిన సంఘటన తానూరు మండలం మహాలింగిలో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై డి.రమేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు శుక్రవారం రేకు డబ్బాలు విక్రయిస్తూ గ్రామంలో సంచరించారు. ఈ క్రమంలో పీరాజీ అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించి, అక్కడే తచ్చాడుతూ తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. గమనించి స్థానికులు ఇంట్లోకి వెళ్లిన దుండగులను పట్టుకుని తాళ్లతో కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై వారిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. నిందితులు నిజామాబాద్ జిల్లా జానకంపేట్ చెందిన వారిగా గుర్తించామని, పూర్తి విచారణ చేపట్టి వివరాలు వెల్లడిస్తామని ఎస్సై పేర్కొన్నారు. గ్రామాల్లో వ్యాపారాల పేరిట తిరిగే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పదంగా ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

5న సోయా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

భైంసా: రైతులు తొందర పడి సోయా దిగుబడులను మార్కెట్‌లో తక్కువ ధరలకు విక్రయించుకోవద్దని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గంగాచరణ్, జిల్లా మేనేజరు ప్రవీణ్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. నియోజకవర్గంలోని భైంసా, కుభీరులో అక్టోబరు 5న ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం చేయనున్నట్లు తెలిపారు. కేంద్రాల్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలు రూ.4,892 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

వర్షానికి కూలిన ఇంటి గోడ

కడెం : మండలంలోని కన్నాపూర్‌కు చెందిన బిరుదుల సురేష్ నివాసముండే పాత పెంకుటిల్లు ఇటీవల కురిసిన వర్షాలకు తడిసి ఓవైపు గోడ కూలిపోయింది. రాత్రి తాము ఇంట్లో ఉన్న సమయంలోనే గోడ కూలినా అదృష్టవశాత్తూ ఎవరికేమీ కాలేదని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి భూమేష్ ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు.

అక్రమాలను వెలికితీయాలి

ఖానాపూర్: హైదరాబాద్‌లో హైడ్రా తరహాలో జిల్లాలోనూ ప్రభుత్వ భూముల్లో చేపట్టిన నిర్మాణాలను కూల్చేసి భూములను స్వాధీనం చేసుకోవాలని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లెపు పీటర్, సహాయ కార్యదర్శి భూక్య సురేందర్ కోరారు. శుక్రవారం వారిక్కడ విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలో చెరువులను కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను కూల్చేయాలని, ఖానాపూర్ పట్టణంలో బొడ్డోనికుంట, కప్పలకుంట శిఖం భూమిలో అక్రమ నిర్మాణాలను వెలికితీయాలన్నారు.

కుర్చీల వితరణ

తానూరు(భైంసా): తానూరు మండలం బోరిగాం జడ్పీ ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయురాలు బద్దం కృష్ణవేణి శుక్రవారం 13 కుర్చీలను విరాళంగా అందించారు. అదే పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న ఆమె పాఠశాలలో కుర్చీలు లేకపోవడాన్ని గమనించి తన సొంత ఖర్చుతో వాటిని సమకూర్చారు.

వైద్య పరీక్షలు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులు వయసుకు తగిన విధంగా బరువు లేక పోవడంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వారికి వైద్య పరీక్షలు డా.విజయానంద్ నిర్వహించారు. చిన్నారుల పోషకులకు పలు సూచనలు అందించారు.

ఆలయ తాత్కాలిక ఉద్యోగికి పాముకాటు

ముథోల్(బాసర): బాసర ఆలయంలో తాత్కాలిక ఉద్యోగి శారద ప్రసాదాల తయారీ కేంద్రం పక్కన ఉన్న డార్మెటరీలో పనులు చేస్తుండగా శుక్రవారం పాముకాటు వేసింది. తోటి ఉద్యోగులు ఆమెను చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు.

వన్యప్రాణులను వేటాడితే చర్యలు తప్పవు

లోకేశ్వరం: అటవీ జంతువులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని అటవీశాఖ రేంజ్ అధికారి రామకృష్ణారావు తెలిపారు. తమ సిబ్బంది గస్తీ నిర్వహిస్తుండగా వేటగాళ్లు పట్టుబడినట్లు చెప్పారు. మండలంలోని లక్ష్మీనగర్ తండా చెందిన నగేశ్, మూడ్ శంకర్‌లు 3 అడవి కుందేళ్లు, 5 కంజు పిట్టలు వేటాడి వాటిని విక్రయానికి తీసుకెళుతుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, నిందితులను రిమాండుకు తరలించినట్లు చెప్పారు.

యువకుల శ్రమదానం

దస్తూరాబాద్ : మండలంలోని దేవునిగూడెం గ్రామ యూత్ సభ్యులు శుక్రవారం శ్రమదానం నిర్వహించారు. గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో ట్రాక్టర్లతో మొరాన్ని తీసుకువచ్చి గుంతలలో నింపి చదును చేశారు.

విశ్వవిద్యాలయం పేరు మార్పు సరికాదు

ఖానాపూర్: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం పేరును సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వ విద్యాలయంగా మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు అన్నారు. ఖానాపూర్ పట్టణంలో శుక్రవారం ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్ శివరాజ్ వినతిపత్రం అందజేశారు. జితేందర్, ఆనంద్‌కుమార్, శేఖరయ్య, శ్రీధర్, విశ్వప్రసాద్, ప్రభాకర్, గంగాధర్, హరీష్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు సమర్పించొద్దు

నిర్మల్ పట్టణం: మైనార్టీ గురుకుల విద్యాసంస్థల్లో పలు ఉద్యోగాల భర్తీకి తాజాగా నోటిఫికేషన్ వెలువడిందని శ్రీ ఆంజనేయ మ్యాన్‌పవర్ ఏజెన్సీస్ నిర్వాహకులు తెలిపారు. అయితే, జిల్లా ఎంపానల్‌మెంట్‌కు సంబంధించి న్యాయస్థానంలో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో నియామక ప్రక్రియ కోర్టు తీర్పు అనంతరమే నియామకాలు జరుగుతాయని చెప్పారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని, దరఖాస్తులేవీ సమర్పించొద్దని కోరారు.